RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను
రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 292 | 13 ఆదివారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## అమరావతి క్వాంటం బయో వ్యాలీకి జాతీయ గుర్తింపునివ్వాలి




అమరావతి క్వాంటం బయో వ్యాలీకి జాతీయ గుర్తింపునివ్వాలి
జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్
డబులింజన్ ప్రభుత్వంతో వైద్యారోగ్య రంగానికి కొత్త ఊపు
వైద్యారోగ్య శాఖలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ సభలో
ముఖ్యమంత్రి రూ.249 కోట్లతో 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్
పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను ప్రారంభించిన
కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ రాజధాని వాయిస్ :** వైద్యారోగ్య రంగంలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంజీవని అమలు చేయనున్నామని, వైద్యరంగం లో ఇది గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని చెప్పారు. జనవరి 1 నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తున్నామని తెలిపారు. అమరావతిలో ఏర్పాటు చేయబోతున్న క్వాంటం బయో వ్యాలీని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కేంద్రాన్ని సీఎం చంద్రబాబు కోరారు. శనివారం వైద్యారోగ్య శాఖకు చెందిన వివిధ అభివృద్ధి కార్యక్ర మాలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటీలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, సీఎం చంద్రబాబు సందర్శించి.. కొత్తగా నిర్మించిన బ్లాక్, ల్యాబరేటరీని ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ కళా వేదికలో ఏర్పాటు చేసిన సభలో రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ గా లాంచ్ చేశారు. ఈ ప్రాజెక్టులతో రాష్ట్రంలో 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్ సదుపాయాలతో పాటు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ వంటి కీలక వైద్య విభాగాల - మిగతా 2లో..

## బీసీల ఆత్మగౌరవం పెంచేలా చంద్రబాబు పాలన

### - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**విజయవాడ, సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్ :** బీసీల ఆత్మగౌరవం పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు పాలిస్తున్నారని, ప్రజల్లోని కూటమి నాయకులు, కార్యకర్తలు గర్వంతో తలెత్తుకుని వెళుతున్నారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో తమదే విజయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ధీమా వ్యక్తంచేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామని స్పష్టంచేశారు. జగన్ లో మరో ఓటమి భయం కనిపిస్తోందన్నారు. కోర్టుల్లో నిలబడేలా బీసీ రక్షణ చట్టాన్ని రూపొందిస్తున్నామన్నారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్ లో వివిధ బీసీ కార్పొరేషన్ చైర్మన్లతో శనివారం బీసీ రక్షణ చట్టంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీలంటేనే టీడీపీ అని స్పష్టం చేశారు. బీసీల ఆత్మగౌరవం పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు పాలిస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ నిర్వహించిన పాదయాత్రలో బీసీ రక్షణ చట్టం అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, బీసీ రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోర్టుల్లో బలంగా నిలబడేలా ఈ చట్టానికి తుదిమెరుగులు - మిగతా 2లో..

## విజయవాడలో మంత్రి నారాయణ ఆకస్మిక పర్యటన

**విజయవాడ రాజధాని వాయిస్ :** ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణ విజయవాడలో ఆకస్మికంగా పర్యటించారు. వర్షపునీటి కాలువలు, డ్రెయిన్లను పరిశీలించారు. వర్షపునీరు నిలిచిన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన పూడికతీత పనులను పర్యవేక్షించారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 2014–19లో డ్రెయిన్ల అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ నిధులను గత ప్రభుత్వం ఉపయోగించలేదన్నారు. డ్రెయిన్లలో పూడిక ఎక్కువగా చేరి నీరు నిలిచిపోతోందని, 70 యంత్రాలతో పూర్తిగా తొలగిస్తున్నామని చెప్పారు. విజయవాడలో రూ.600 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రెండ్రోజుల్లో సిల్ట్ తొలగించి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడతామన్నారు.

## పౌల్ట్రీ రైతుల సంక్షేమానికి పెద్దపీట

### - పౌల్ట్రీ అసోసియేషన్ సభ్యులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్ :** రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు అండగా నిలిచేందుకు ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026–29కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పాలసీకి ఆమోదం తెలిపిన సందర్భంగా పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం విజయవాడలోని కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాలసీని త్వరితగతిన అమల్లోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పౌల్ట్రీ రంగానికి నూతన ఊతం అందించడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, పెట్టుబడులను ఆకర్షించడం, ఉత్పాదకతను పెంచడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా పాలసీని రూపొందించినట్లు తెలిపారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం - మిగతా 2లో..

## రూ.253 కోట్లతో అమరావతిలో దేశంలోనే అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్: ఏపీ డీజీపీ



**అమరావతి రాజధాని వాయిస్ :** రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలు పోలీసు నేర పరిశోధనకు వెన్నుముక లాంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈరోజు రాజమండ్రిలో పర్యటించిన ఆయన... రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖ సహా పలు కేంద్రాల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. డీఎన్ఏ నివేదికలను ప్రస్తుతం 7 రోజుల్లోనే, అత్యంత కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే అందిస్తున్నామని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా స్థాయిలో 'క్లిక్' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజమండ్రి గోదావరి పుష్కరాల సందర్భంగా రద్దీ నివారణకు అధునాతన డ్రోన్లు, రికార్డింగ్ మోడ్‌లోని సీసీటీవీల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ పేర్కొన్నారు.

## చంద్రబాబుతో నడ్డా భేటీ

### – సీఎం నివాసంలో మర్యాదపూర్వక సమావేశం
### – అభివృద్ధి ప్రాజెక్టుల వేగవంతంపై చర్చ
### – వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంపై సమాలోచనలు



**అమరావతి, సెప్టెంబర్ 12రాజధాని వాయిస్ :** కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా శనివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో అమరావతిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అమరావతికి వచ్చిన జేపీ నడ్డాను సీఎం తన నివాసానికి ఆహ్వానించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న కీలక అభివృద్ధి ప్రాజెక్టులను మరింత వేగవంతం చేసే అంశంపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.'వికసిత ఆంధ్రప్రదేశ్' లక్ష్య సాధన దిశగా చేపట్టాల్సిన కార్యాచరణపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కొనసాగుతుందని జేపీ నడ్డా హామీ ఇచ్చినట్లు తెలిసింది. అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని జేపీ నడ్డా పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌ను మరింత ప్రగతి, సంపద, అభివృద్ధి వైపు నడిపించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్ర ప్రజలకు మరింత చేరువయ్యేలా చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాల్లో కేంద్ర మద్దతు కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలను కేంద్ర మంత్రితో చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశం అనంతరం ఇరువురు నేతలు పరస్పర సహకారంతో రాష్ట్రాభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం బలోపేతం కావడం ద్వారా ప్రజలకు మెరుగైన ఫలితాలు అందుతాయని అభిప్రాయపడ్డారు. ఈ భేటీ రాష్ట్ర అభివృద్ధి దిశగా కీలక చర్చలకు వేదికగా నిలిచిందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## కొండకావూరులో కరివేపాకు పరిశ్రమకు శంకుస్థాపన



- రూ.2.33 కోట్లతో ప్రాసెసింగ్ కేంద్రం ఏర్పాటు
- రైతులు, మహిళలకు స్థిరమైన ఆదాయమే లక్ష్యమని వెల్లడి
- గ్రామీణ ఉపాధి, మహిళా సాధికారతకు ప్రాధాన్యం
- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

**నరసరావుపేట రాజధాని వాయిస్ :** నరసరావుపేట మండలం కొండకావూరు గ్రామంలో రూ.2.33 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న కరివేపాకు ప్రాసెసింగ్ కేంద్రానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. రైతులు పండించే కరివేపాకుకు విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అధిక ఆదాయం అందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన లావు శ్రీకృష్ణదేవరాయలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు రైతులు, మహిళల ఆర్థిక సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. రైతులు పండించే పంటలకు మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు వాటి విలువను పెంచే పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాసెసింగ్ కేంద్రం ద్వారా స్థానిక రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 28 మండలాల్లో ప్రత్యేక క్లస్టర్ల ద్వారా ఇటువంటి పరిశ్రమలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఎంపీ వెల్లడించారు. రైతులు, మహిళలు నెలనెలా స్థిరమైన ఆదాయం పొందే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. కరివేపాకు ప్రాసెసింగ్ కేంద్రం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా - మిగతా 2లో..

## గవర్నర్‌కు మహాగణపతి ఉత్సవాల ఆహ్వానం

### – మంగినపూడి సాగరతీర మహాగణపతి ఉత్సవాలకు ఆహ్వాన పత్రిక అందజేత
### – గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన మంత్రి కొల్లు రవీంద్ర
### – ఉత్సవాల్లో పాల్గొనాలని వినతి



**అమరావతి, సెప్టెంబర్ 12రాజధాని వాయిస్ :** మచిలీపట్నం మంగినపూడి తీరంలో నిర్వహిం చనున్న సాగరతీర మహాగణపతి ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ఆహ్వానించారు. ఈ మేరకు లోక్ భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాల కు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశా రు. ఉత్సవాల విశిష్టత, ప్రత్యేకతలను గవర్నర్‌కు వివరించారు. మంగినపూడి తీరంలో ప్రతి ఏడాది భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించే గణేశ్ ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు. - మిగతా 2లో..

## యూట్యూబర్ రమా నందనకు మరోసారి ఏపీ పోలీసుల నోటీసులు



**అమరావతి, సెప్టెంబర్ 12 :** యూట్యూబర్ రమా నందనకు ఏపీ పోలీసులు మరోసారి నోటీసులు అందజేశారు. లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.10.50 లక్షలు మోసం చేశారని రమా నందనపై పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు జులై 4వ తేదీన అద్దంకి పోలీస్ స్టేషన్‌లో రమా నందనపై కేసు నమోదు చేశారు.ఉద్యోగం ఏర్పాటు చేయకపోవడంతో పాటు, తీసుకున్న నగదును తిరిగి ఇవ్వలేదని బాధితులు ఆరోపించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సెప్టెంబర్ 17వ తేదీన అద్దంకి పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరుకావాలని రమా నందనను పోలీసులు ఆదేశించారు. ఈ కేసులో ఆమె వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేయనున్నారు. రమా నందనపై పోలీసుల తదుపరి చర్యలపై ఉత్కంఠ నెలకొంది.

# కొండకావూరులో కరివేపాకు పరిశ్రమకు శంకుస్థాపన






పెరుగుతాయని నాయకులు పేర్కొన్నారు. కరివేపాకును శుద్ధి చేసి, నిల్వ చేసి, మార్కెట్‌కు అనుగుణంగా తయారు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. దీంతో పాటు మహిళా సంఘాలకు కూడా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ఇలాంటి పరిశ్రమలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళా శక్తి సాధించలేనిది ఏదీ లేదని, అందుబాటులోకి వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రాసెసింగ్ కేంద్రం ఏర్పాటుతో కొండకావూరు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల రైతులకు కొత్త అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, మహిళా సాధికారత దిశగా ఈ ప్రాజెక్టు ఒక కీలక ముందడుగుగా నిలవనుందని పేర్కొన్నారు.

# గవర్నర్‌కు మహాగణపతి ఉత్సవాల ఆహ్వానం



ఈ ఏడాది కూడా మరింత వైభవంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ కార్యక్రమానికి అన్ని వసతులు కల్పిస్తున్నామని వెల్లడించారు. సాగరతీర మహాగణపతి ఉత్సవాలు ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి కూడా దోహదపడుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. మంగినపూడి తీర ప్రాంతానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు తరలివస్తారని తెలిపారు. ఈ ఉత్సవాల ద్వారా మచిలీపట్నం ప్రాంతానికి మరింత గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. పర్యావరణ హిత ఉత్సవాల నిర్వహణకు ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా చేపడుతున్నామని చెప్పారు. భక్తులు పర్యావరణాన్ని కాపాడే విధంగా ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లు, భక్తుల రద్దీ నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహాగణపతి ఉత్సవాలకు గవర్నర్‌ను ఆహ్వానించడం పట్ల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఉత్సవాలు మచిలీపట్నం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. భక్తుల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు.

# బ్రిక్స్ స్మారక తపాలా బిళ్లలు విడుదల చేసిన మోదీ

- బ్రిక్స్ రెండు దశాబ్దాల ప్రయాణానికి ప్రత్యేక గుర్తింపు
- **18వ బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఆవిష్కరణ**
- స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారానికి ప్రతీకగా రూపకల్పన




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్ :** బ్రిక్స్ సంస్థ ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తైన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు ప్రత్యేక స్మారక తపాలా బిళ్లలను విడుదల చేశారు. న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సు వేదికగా ఈ బిళ్లలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సంభాషణ, సహకారం, భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో బ్రిక్స్ కీలక వేదికగా ఎదిగిందన్నారు. గత ఇరవై ఏళ్లలో బ్రిక్స్ సంస్థ ప్రపంచ ఆర్థిక, సామాజిక, వ్యూహాత్మక అంశాల్లో ప్రభావవంతమైన పాత్ర పోషించిందని పేర్కొన్నారు. విడుదల చేసిన స్మారక తపాలా బిళ్లు బ్రిక్స్ ప్రయాణాన్ని, సభ్య దేశాల ఉమ్మడి లక్ష్యాలను ప్రతిబింబిస్తున్నాయని మోదీ తెలిపారు. భారత్ చేపట్టిన బ్రిక్స్–2026 అధ్యక్ష బాధ్యతల ప్రధాన అంశాలైన స్థిరత్వ నిర్మాణం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిర అభివృద్ధిని ఈ బిళ్లల్లో ప్రతిష్మాత్మకంగా ఆవిష్కరించినట్లు చెప్పారు. "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే అంశంతో భారత అధ్యక్ష బాధ్యతలు కొనసాగుతున్నాయని, ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు సభ్య దేశాలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రధాని పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర విశ్వాసం, భాగస్వామ్యం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ తపాలా బిళ్లు కేవలం స్మారక చిహ్నాలు మాత్రమే కాకుండా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి సంకల్పానికి ప్రతీకలుగా నిలుస్తాయని మోదీ అన్నారు. భావితరాలకు సహకారం, అభివృద్ధి, సుస్థిరత సందేశాన్ని ఇవి అందిస్తాయని తెలిపారు. 18వ బ్రిక్స్ సదస్సులో భాగంగా విడుదలైన ఈ స్మారక తపాలా బిళ్లు సభ్య దేశాల మధ్య ఐక్యతను, అభివృద్ధి లక్ష్యాల పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. బ్రిక్స్ సహకారాన్ని మరింత విస్తరించేందుకు భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# అమరావతి క్వాంటం బయో వ్యాలీకి జాతీయ గుర్తింపునివ్వాలి



సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం మరింత చేరువ కానుంది. అత్యాధునిక వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులను తగ్గించేలా ఈ సదుపాయాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

**డబులింజన్ సర్కారుతో అభివృద్ధి**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని అన్నారు. దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెండింతలకుపైగా పెంచారని తెలిపారు. కోవిడ్ సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన ఘనత భారతదేశానికి, ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందని పేర్కొన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు మందులు అందుతున్నాయని చెప్పారు. అభా కార్డుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఫార్మా రంగానికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా ఉందని, మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. వంటశాలను ఫార్మసీగా... ఆహారాన్నే ఔషధంగా భావించాలని సూచించారు. ఈ మేరకు ఆరోగ్య పద్దతులను మార్చుకోవాలని చెప్పారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి వాటిని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని, యోగాభ్యాసంతో ఎనర్జీ లెవల్స్ పెరుగుతాయని అన్నారు. సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. జేపీ నడ్డా నాయకత్వంలో దేశంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందన్న నమ్మకం ఉందన్నారు. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కూడిన డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వల్లే ఇటువంటి అభివృద్ధి సాధ్యమవుతోందని చెప్పారు. వైద్యారోగ్య రంగంతో పాటు అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటిని అందిస్తున్నామని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తున్నామని చెప్పారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తీసుకువచ్చామని గుర్తుచేశారు. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని చంద్రబాబు స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు సహకరించి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'హెల్తీ--వెల్తీ--హ్యాపీ ఆంధ్రప్రదేశ్' దిశగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**సాంకేతికతతో సత్వర ప్రగతి**

సంప్రదాయ ఆరోగ్య విధానాలను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే వైద్యారోగ్య రంగంలో మరింత మెరుగైన సేవలు అందించగలమన్నారు. సాంకేతికతను అన్ని రంగాల్లో విస్తృతంగా వినియోగిస్తే రాబోయే పదేళ్లలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించగలదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అమరావతిని భవిష్యత్ సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అమరావతిలో క్వాంటం బయో వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని, దీనికి జాతీయ గుర్తింపు ఇవ్వాలని కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేశారు. దేశంలో తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలోనే ప్రారంభం కానుందని తెలిపారు. అమరావతి గురించి లద్దాఖ్‌లోనూ చర్చించుకునే పరిస్థితి వచ్చిందని చంద్రబాబు అన్నారు. అన్ని ప్రాంతాల్లో అమరావతికి గుర్తింపు లభించిందని, భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించి చర్చించుకునే రోజు వస్తుందని చెప్పారు. ఏఐ రంగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు యువతకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ప్రజా ప్రతినిధులు కేశినేని శివనాథ్, బోండా ఉమ, సోము వీర్రాజు సహా వైద్యారోగ్య శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**చప్పట్లు... కేరింతలతో మార్మోగిన అంబేద్కర్ కళా వేదిక**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో సీఎం వేదికపైకి రాగానే వైద్య విద్యార్థులు, సభికులు పెద్దఎత్తున హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి ప్రసంగం సందర్భంగా అడుగడుగునా చప్పట్లతో కళావేదిక మార్మోగింది. దీంతో సీఎం చంద్రబాబు కూడా అంతే ఉత్సాహంతో స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమరావతి, సంజీవని ప్రాజెక్టు, ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి సీఎం చంద్రబాబు ప్రస్తావించిన ప్రతి సందర్భంలోనూ కళా వేదికలో పెద్ద ఎత్తున చప్పట్లతో సభికులు హర్షధ్వానాలు తెలిపారు. సభ ముగిసిన తర్వాత సభికుల ఆనందోత్సాహాల్లో పాలుపంచుకుంటూ.. వేదిక మీద నుంచే కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కలిసి సీఎం చంద్రబాబు సెల్ఫీ తీసుకున్నారు.

# బీసీల ఆత్మగౌరవం పెంచేలా చంద్రబాబు పాలన

దిద్దుతున్నామన్నారు. దీనిలో భాగంగా మంత్రివర్గ ఉప సంఘంతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమావేశాలు నిర్వహించామన్నారు. బీసీలను కులం, వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణలు చేసినా చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. జిల్లాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తామని, రెండు నెలల్లో కేసుల దర్యాప్తు పూర్తి చేసేలా నిబంధనలు రూపొందించామని తెలిపారు. బీసీ రక్షణ చట్టాన్ని కోర్టుల్లో నిలబడేలా రూపొందిస్తున్నామన్నారు. ఇప్పుడు 156 బీసీ కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్పొరేషన్ల చైర్మన్ల నుంచి అభిప్రాయాలు తీసుకున్నామని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీలోనే బీసీ రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు.

**బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం...**

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని మంత్రి సవిత స్పష్టం చేశారు. 19987 అన్న ఎన్టీఆర్ తొలిసారిగా బీసీలకు రిజర్వేషన్లకు అమలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు 34 శాతానికి రిజర్వేషన్లు పెంచారన్నారు. 2019 తరవాత అధికారంలోకి వచ్చిన జగన్ ...బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి



కుదించారన్నారు. గొడ్డలి పార్టీ చర్యతో బీసీలకు రాజకీయంగా తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మరోసారి 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి సవిత తెలిపారు.

# పౌల్ట్రీ రైతుల సంక్షేమానికి పెద్దపీట

రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందని వివరించారు. ఇందులో ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించిన ప్రోత్సాహకాల కోసం రూ.209 కోట్లు, ఇండస్ట్రియల్ పాలసీ కింద రూ.152.18 కోట్లు, పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేయనున్న కార్యక్రమాలకు రూ.296 కోట్లు కేటాయించనున్నారు. కోళ్ల ఫారాలు, హేచరీల మౌలిక వసతుల అభివృద్ధికి తీసుకునే రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ కల్పించనున్నామని, ఇందుకోసం మూడేళ్ల కాలానికి రూ.72 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పౌల్ట్రీ రైతుల విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు లో-టెన్షన్ కోళ్ల ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు యూనిట్‌కు రూ.4.75 చొప్పున టారిఫ్‌ను క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసే ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ (జుజ) పౌల్ట్రీ షెడ్లకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు క్యాపిటల్ సబ్సిడీ అందించనున్నాం. ఇప్పటికే ఉన్న పౌల్ట్రీ షెడ్లను ఆధునీకరించేందుకు కూడా 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు సబ్సిడీ అందించేలా ప్రతిపాదించాం. అర్హత కలిగిన జుజ పౌల్ట్రీ ఫారాలకు టర్మ్ లోన్లపై వడ్డీ సబ్సిడీతో పాటు విద్యుత్ చార్జీలపై యూనిట్‌కు రూ.2 వరకు, సంవత్సరానికి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు, మూడు సంవత్సరాల పాటు విద్యుత్ టారిఫ్ సబ్సిడీ అందించనున్నాం. అలాగే నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద అర్హత కలిగిన ప్రాజెక్టులకు 50 శాతం వరకు క్యాపిటల్ సబ్సిడీ, గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు అందించే అవకాశం కల్పించాం అని మంత్రి తెలిపారు. గ్రామీణ మహిళలకు ఉపాధి, అదనపు ఆదాయం కల్పించేందుకు బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. SERP, DRDAల ఆధ్వర్యంలో మహిళలకు 30--45 రోజుల శిక్షణ, వ్యాక్సినేషన్, డే-ఓల్డ్ చిక్స్ సరఫరా వంటి



సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. పౌల్ట్రీ ఉత్పత్తులకు విలువ జోడించి మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు PPP విధానంలో ఎగ్, చికెన్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని, ముఖ్యంగా చిత్తూరు, విజయవాడ, విశాఖపట్నం నగరాలను కేంద్రాలుగా చేసుకుని చికెన్ ప్రాసెసింగ్ ప్లాంట్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పౌల్ట్రీ షెడ్ల నిర్మాణానికి గతంలో ఉన్న డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ చార్జీల నుంచి పూర్తి మినహాయింపు కల్పించి, మున్సిపాలిటీలు, అర్బన్ అథారిటీల పరిధిలో గ్రామ పంచాయతీలకు సమానమైన తక్కువ ఫీజులతో అనుమతులు పొందేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో మొక్కజొన్న ధరల పెరుగుదల కూడా ఒకటని పేర్కొన్న మంత్రి, ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నూక బియ్యాన్ని పౌల్ట్రీ ఫారాలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పౌల్ట్రీ రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, సంబంధిత శాఖల సమన్వయంతో రాష్ట్ర పౌల్ట్రీ రంగాన్ని దేశంలోనే మరింత అభివృద్ధి చెందిన రంగంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# 19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల డిసెంబర్ కోటా విడుదల

**తిరుమల రాజధాని వాయిస్ :** డిసెంబర్ నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల కోటాను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్ కోసం 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో ఎంపికైన భక్తులు 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లిస్తే టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, పుష్పయాగం టికెట్లను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం కోటా విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు డిసెంబర్ నెల ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటా విడుదలవుతుంది. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.

**శ్రీవారి బ్రహ్మోత్సవాలు.. చంద్రబాబుకు ఆహ్వానం**

తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీఎం చంద్రబాబును తితిదే ఆహ్వానించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నివాసంలో తితిదే బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, జానకిదేవి, తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర తదితరులు సీఎంను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా తితిదే వేద పండితులు సీఎంకు వేదాశీర్వచనం అందించారు.



శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలపై చంద్రబాబు వారితో చర్చించారు.

# మున్నలూరుకు బీటీ రోడ్డు శంకుస్థాపన

- గ్రామీణ రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం
- మున్నలూరు రహదారి పనులకు శంకుస్థాపన చేసిన తంగిరాల సౌమ్య
- మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని వెల్లడి



**కంచికచర్ల, సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్ :** కూటమి ప్రభుత్వం గ్రామీ ణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం అభివృద్ధికి కీలకమని ఆమె అన్నారు. కంచికచర్ల మండలం మున్నలూరు గ్రామంలో శనివారం అధికారులు, కూటమి నాయకులతో కలిసి జూణ =ఢదీ రోడ్ నుంచి మున్నలూరు వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతా ప్రమాణా లతో పూర్తి చేయాలని సూచించారు.సుమారు 1.350 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ బీటీ రహదారి పనులు పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. వర్షాకాల ంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తు ల రవాణాకు కూడా ఈ రహదారి ఉపయోగపడనుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. ఈ సందర్భంగా మాట్లాడిన కూటమి నాయకులు గతంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రహదారుల అభివృద్ధిపై ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ను క్రమంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రజలకు అవసరమైన రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నా రు. నందిగామ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రహదారి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కావాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. మున్నలూరు గ్రామ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు మరింత తోడ్పడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజల వద్దకే పాలన: ఎమ్మెల్యే పర్యటన

- 48వ డివిజన్‌లో ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన
- అర్జీలు స్వీకరించి అధికారులకు తక్షణ ఆదేశాలు
- ప్రజల వద్దకే పాలన తీసుకెళ్తున్నామని వెల్లడి





**గుంటూరు, సెప్టెంబర్ 12రాజధాని వాయిస్ :** ప్రజలకు చేరువగా పాలన అందించి వారి సమస్యలను వేగంగా పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు. "మన ఎమ్మెల్యే -- మన వద్దకు" కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం గుంటూరు నగరంలోని 48వ డివిజన్‌లో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను స్వయంగా వినడం ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని ఆయన స్వయంగా స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సమస్యల పరిష్కారాన్ని వారి వద్దకే తీసుకెళ్లే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కరమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గతంలో చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అనేక కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండేవని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ప్రజా పాలనకు నిదర్శనమని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు.ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలను కలిసే నాయకత్వం కాకుండా, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకత్వమే తమ లక్ష్యమని డాక్టర్ బూర్ల రామాం జనేయులు తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు కొనసాగు తాయని ఎమ్మెల్యే వెల్లడించారు.

# వినాయక ఉత్సవాలపై శాంతి కమిటీ సమావేశం

**కడప, సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్ :** రాబోయే వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, సౌహార్ద వాతావరణంలో నిర్వహించేం దుకు కడప జిల్లా పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్‌లో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కడప రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చల్లని దొర ఆధ్వర్యంలో, పెండ్లిమర్రి ఉప ఇన్‌స్పెక్టర్ తులసి నాగ ప్రసాద్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. స్థానిక ప్రజాప్రతి నిధులు, మండప నిర్వాహకులు, గ్రామ పెద్దలు, ప్రజలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు వినాయక ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఉత్సవాలు నిర్వహించే సమయంలో చట్ట నిబంధనలను తప్పని సరిగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకూడదని సూచించారు. సామాజిక సామరస్యాన్ని కాపాడుతూ అందరూ కలిసి పండుగను జరుపుకోవాలని కోరారు.వినాయక మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల సమ యంలో పోలీసు శాఖ జారీ చేసే మార్గదర్శకాలను పాటించాలని అధికారులు తెలిపారు. శబ్ద కాలుష్య నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా చర్యల విషయంలో నిర్వాహకులు పూర్తి సహకా రం అందించాలని కోరారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని పోలీసులు స్పష్టం చేశారు. మండపాల వద్ద అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు విద్యుత్, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లను కూడా పటిష్టంగా చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమా చారం అందించాలని తెలిపారు.వినాయక ఉత్సవాలు ఆధ్యాత్మిక తతో పాటు సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని సమావేశ ంలో అభిప్రాయపడారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పరస్పర సహకారంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు, నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరిం చాలని కోరారు. శాంతి కమిటీ సమావేశం ద్వారా ఉత్సవాల నిర్వహణపై అవగాహన కల్పించడంతో పాటు ముందస్తు జాగ్రత్తలపై చర్చించారు. ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజల సహకారంతో పండుగను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణ

**గుంటూరు, సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్ :** వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహిస్తూ మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు ప్రజలు చొరవ చూపాలని కోరారు. రసాయన రంగులతో తయారైన గణపతి విగ్రహాల వల్ల చెరువులు, నదులు, ఇతర జలవనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కాలుష్యం నీటి నాణ్యతను దెబ్బతీసి జలచరాల జీవనానికి కూడా ముప్పు కలిగిస్తుందని పేర్కొన్నారు.కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సూచనల మేరకు పర్యావరణహిత మట్టి విగ్రహాలు, సహజ రంగులతో తయారైన విగ్రహాలనే వినియోగించాలని ఆయన సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే పదార్థాల వినియోగాన్ని నివారించడం ద్వారా ప్రకృతిని కాపాడవచ్చని తెలిపారు. వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని ప్రభుత్వం గుర్తించిన, నిర్దేశించిన ప్రదేశాల్లోనే నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనివల్ల జలవనరుల కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు ప్రజల భద్రతను కూడా నిర్ధారించవచ్చన్నారు.జిల్లాలో పర్యావరణహిత వినాయక ఉత్సవాల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో పరిశుభ్రత, భద్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పర్యావరణహిత గణపతి ఉత్సవాలను నిర్వహించాలని, భక్తి భావంతో పాటు ప్రకృతి పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు.

# 48వ డివిజన్‌లో రూ.7.4 కోట్ల పనులకు శ్రీకారం

- రోడ్లు, కాలువల అభివృద్ధి పనుల ప్రారంభం
- కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వ్యాఖ్య
- ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన లక్ష్యమని వెల్లడి





**గుంటూరు, సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 48వ డివిజన్‌లో రూ.7.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ బూర్ల రామాంజనేయులు శనివారం శ్రీకారం చుట్టారు. "మన ఎమ్మెల్యే -- మన వద్దకు" కార్యక్రమంలో భాగంగా సిమెంట్ రహదారులు, కాలువల నిర్మాణ పనులను ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 48వ డివిజన్‌లో సుమారు 40 ప్రాంతాల్లో రహదారులు, కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఈ డివిజన్‌లో రూ.25 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకే అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే చెప్పారు. ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేం దుకు అవసరమైన నిధులను కేటాయిస్తూ పనులను వేగవంతం చేస్తున్నామని వివరించారు. అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో రోడ్లు, కాలువలు వంటి కనీస మౌలిక వసతుల అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించి పనులను పూర్తి చేస్తోందని తెలిపారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న రహదారులు, కాలువల సమస్యలకు పరిష్కారం లభిస్తుండటంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల వద్దకు వచ్చి సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజ నేయులకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయితే 48వ డివిజన్‌లో ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

# పెద్ద పసుపలలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహణ

- జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు
- మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన
- అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా





**కడప, రాజధాని వాయిస్ :** జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు శనివారం పెద్ద పసుపల గ్రామ పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ముద్దనూరు సర్కిల్ ఇన్‌స్పె క్టర్ నగేష్ బాబు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో పోలీసు సిబ్బంది విస్తృతంగా పాల్గొన్నారు. గ్రామంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఆపరేషన్ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ఇంటింటా తనిఖీలు చేపట్టారు. అనుమా నాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు, చట్టవిరుద్ధ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాలు, గుర్తింపు పత్రాలు, ఇతర వివరాల ను పరిశీలిస్తూ భద్రతా చర్యలను పటిష్టం చేశారు.మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలపై నేరాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలి, భద్రతా చర్యలు ఎలా పాటిం చాలి అనే అంశాలపై సూచనలు అందించారు. మహిళలు నిర్భయంగా తమ సమస్యలను పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవు తుందని పోలీసులు తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండడం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడవచ్చని వివరించారు.కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో భయాందోళనలు కలిగించడంతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు ఇటువంటి తనిఖీలు తరచూ నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలతో మమేకమై వారి సమస్యలను కూడా తెలుసుకున్నారు. ప్రజా భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. సమాజంలో సురక్షిత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మొగులూరులో టీడీపీలో భారీ చేరికలు

- వైసీపీకి చెందిన 25 కుటుంబాల చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానించిన తంగిరాల సౌమ్య
- కూటమి పాలనపై విశ్వాసంతో చేరిన నేతలు



**మొగులూరు, రాజధాని వాయిస్ :** కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం మొగులూరు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 25 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ చేరికలతో గ్రామ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలితాలు తమను ప్రభావితం చేశాయని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు వేగవంతమయ్యా యని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజ నాలు అందుతున్నాయని చేరిక చేసిన నాయకులు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకు లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్య, వైద్యం, సాగునీటి రంగాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతూ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.నందిగామ నియోజకవర్గంలో తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల అమలు, సంక్షేమ పథకాల అందజేతకు ప్రాధాన్య త ఇస్తున్నట్లు నాయకులు తెలిపారు. నియోజకవర్గంలో కొనసాగు తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల నమ్మకమే తెలుగుదేశం పార్టీ బలమని, రానున్న రోజుల్లో మరింత మంది ప్రజలు కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తారని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత కంటి, దంత వైద్య శిబిరం



**రాజుపాలెం.సెప్టెంబర్ 12, రాజధాని వాయిస్:** సత్తెనపల్లి నియోజకవర్గం, రాజుపాలెం మండలం, కొండమోడు గ్రామంలో కాపునాడు, జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ రాజుపాలెం మండల ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు సారథ్యంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహిం చారు.డాక్టర్ అగర్వాల్ ఐ క్లినిక్ స్టాఫ్, అమరావతి డెంటల్ కేర్ డాక్టర్ సాధు నర్సింహారావు హాజరయ్యారు.ఉచిత వైద్య శిబిరం నందు వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## అభివృద్ధే ప్రాంతాల ప్రగతికి సోపానాలు

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శ్రీకారం**



**కారంపూడి.సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్ :**అభివృద్ధే ప్రాంతాల ప్రగతికి సోపానాల అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. శనివారం కారంపూడి మండలంలో పర్యటించిన ఆయన రూ. 42 లక్షతో నూతనంగా నిర్మించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల నందు రూ. 50 లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ముందుగా శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థాన కమిటి ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కారంపూడిలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభం




**కారంపూడి.సెప్టెంబర్ 12రాజదాని వాయిస్ :**మండలంలో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు.గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ క్లినిక్ ఉపయోగపడుతుందని బ్రహ్మానంద రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్‌మెంట్ డీఎంహెచ్ఓ రత్న మన్మోహన్, కారంపూడి పిహెచ్సి డాక్టర్ రమ్య, డాక్టర్ మౌనిక, హెల్త్ అసిస్టెంట్ లాలు నాయక్, సీహెచ్ఓ మస్తాన్ టీడీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మట్టి గణపతిని పూజిద్దాం

**పర్యావరణాన్ని కాపాడుదాం**
**ఎమ్మెల్యే జెబిఆర్**



**మాచర్ల.సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్ :**మట్టిగణపతిని పూజిద్దాం.., పర్యావరణాన్ని కాపాడుదామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేయనున్న మట్టి గణపతి ప్రతిమలు, వినాయక వ్రతకల్ప పుస్తకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వినాయక చవితి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు. మట్టి గణపతుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వాసవి క్లబ్ సభ్యులు ఉచితంగా ప్రతిమలను, వ్రతకల్ప పుస్తకాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవ రావు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు చుండూరు సత్యనారాయణ, బచ్చు రాజకుమార్, కోశాధికారి బత్తుల వీరబ్రహ్మం, సభ్యులు గంగిశెట్టి రాధాకృష్ణమూర్తి, భవనాసి రవితేజ, కొత్తూరు చందు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలను నిర్మూలించడం సమాజ బాధ్యత

**- సీనియర్ అడ్వకేట్ జిజే రావు**




దుర్గి.సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్:బాల్య వివాహాలను నిర్మూలించటం సమాజ బాధ్యత అని మాచర్ల సీనియర్ అడ్వకేట్ గెల్లెపోగు జయానందరావు అన్నారు. పల్నాడు జిల్లాలో బాల్యవివాహాలు నిర్మూలనను కార్డ్స్ సంస్థ బాలబాట అవేర్నెస్ కార్యక్రమాలు ప్రజలను చైతన్య పరచడం నేటి అవసరం అని కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం దుర్గిలో ఉపాధి హామీ మీటింగ్ హాల్ నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దుర్గి బాలబాట ఏసిఓ కుక్కమూడి ప్రమీల అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్ మాట్లాడుతూ, నిరక్షరాస్యత మూఢనమ్మకాలు అభద్రత భావంతో కొంతమంది బాల్యవివాహాలు జరుగుతున్నాయని ,వాటిని విద్య ద్వారానే నిర్మూలించవచ్చని బాల్యవివాహాలు నిర్మూలన ఏ ఒక్క ప్రభుత్వ శాఖ బాధ్యత కాదని అన్నారు.పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం చట్ట ప్రకారం 2006 లో వచ్చిన చట్టం ప్రకారం ఆడపిల్లలకు 18 ,మగ పిల్లలకు 21 ఏళ్ళు నిండిన వారికి పెండ్లి చేయాలని అలా కాకుండా పెండ్లి చేస్తే బాల్య వివాహాలు కిందకే వస్తాయని అది చట్టరీత్యా నేరమన్నారు.ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు గురజాల అప్పారావు, ఏపీ భవన నిర్మాణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యరసాని జక్రయ్య, గేరా మల్లయ్య, పేరుపోగు ప్రసాదరావు, మాచర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాచర్ల కోర్టులో జాతీయ లోక్ అదాలత్ 264 కేసుల పరిష్కారం




**మాచర్ల.సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్ :**మాచర్ల కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్ జడ్జి పి. ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న వివిధ సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్ తదితర కేసులను పరిశీలించి ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ఖర్చు వృథా చేసుకోకుండా పరస్పర రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ మంచి వేదికగా నిలిచింది.ఈ సందర్భంగా మొత్తం 264 కేసులు పరిష్కారమైనట్లు వివరాల ప్రకారం తెలుస్తోంది. ఇందులో 28 కేసులకు రూ.1.10 లక్షలు, 4 చెక్ బౌన్స్ కేసులకు రూ.10,24,360, 13 సివిల్ కేసులు, 45 ఈపీ కేసులు, 172 ఇతర కేసులు, 2 క్రిమినల్ కేసులకు రూ.20.50 లక్షల మేర పరిష్కారం జరిగింది. మొత్తంగా రూ.1,38,37,978 విలువైన కేసులు పరిష్కారం పొందినట్లు నమోదు చేశారు.లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరంగా, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకునే అవకాశం ఉందని న్యాయవర్గాలు పేర్కొన్నాయి. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బొంగునూరి జనార్ధన్ రెడ్డి మృతి పట్ల పవన్ కళ్యాణ్ సంతాపం

- జనసేన ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి సోదరుడి మృతి పట్ల దిగ్భ్రాంతి
- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన పవన్ కళ్యాణ్
- ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన



**అమరావతి, సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్:** టీటీడీ పాలక మండలి సభ్యుడు, జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి సోదరుడు బొంగునూరి జనార్ధన్ రెడ్డి అకాల మరణం పట్ల ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి వార్త తనను కలచివేసిందని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. బొంగునూరి జనార్ధన్ రెడ్డి మృతి బొంగునూరి కుటుంబానికి తీరని లోటని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం పొందాలని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.జనార్ధన్ రెడ్డి సమాజంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తిగా గుర్తింపు పొందారని పవన్ కళ్యాణ్ అన్నారు. ఆయన అకాల మరణం కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు, బంధువులకు కూడా తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. ఈ నష్టం అందరికీ బాధాకరమని తెలిపారు. మరణించిన జనార్ధన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని భరించే శక్తిని ప్రసాదించాలని కోరుకున్నారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.బొంగునూరి మహేందర్ రెడ్డి జనసేన పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకుడిగా, అలాగే టీటీడీ పాలక మండలి సభ్యుడిగా సేవలందిస్తున్నారని రాజకీయ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో జనార్ధన్ రెడ్డి మృతి పట్ల పలువురు రాజకీయ, సామాజిక రంగ ప్రముఖులు కూడా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. జనార్ధన్ రెడ్డి మృతి వార్త తెలిసిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ముందుకు వస్తున్నారు. బంధువులు, స్నేహితులు, అభిమానులు పెద్ద సంఖ్యలో సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## బనగానపల్లెలో ప్రజారోగ్య ప్రయోగశాల ప్రారంభం

- అందుబాటులోకి రూ.1.25 కోట్లతో ఆధునిక ప్రయోగశాల
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న బైరెడ్డి శబరి, బీసీ జనార్ధన్ రెడ్డి
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యమని వెల్లడి





**బనగానపల్లె, రాజధాని వాయిస్: :** బనగానపల్లె ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో రూ.1.25 కోట్ల వ్యయంతో నిర్మించిన సమీకృత ప్రజారోగ్య ప్రయోగశాలను శనివారం పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య పరీక్షలు, ఆరోగ్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైరెడ్డి శబరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక సదుపాయాలను కల్పించడం ద్వారా నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఈ ప్రయోగశాల ద్వారా ప్రజలు వివిధ వైద్య పరీక్షలను స్థానికంగానే పొందగలరని తెలిపారు.రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలు పరీక్షల కోసం ప్రైవేటు కేంద్రాలకు వెళ్లి అధిక ఖర్చులు భరించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రజారోగ్య సేవలను మరింత బలోపేతం చేయడంలో ఈ ప్రయోగశాల కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రూ.1.25 కోట్లతో నిర్మించిన ఈ ప్రయోగశాలలో ఆధునిక వైద్య పరీక్షల పరికరాలను ఏర్పాటు చేశారు. వివిధ రకాల రోగ నిర్ధారణ పరీక్షలను వేగవంతంగా నిర్వహించే సదుపాయం కల్పించారు. దీంతో బనగానపల్లెతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

## బ్రహ్మోత్సవాలకు సీఎంకు ఆహ్వానం

- చంద్రబాబును ఆహ్వానించిన టీటీడీ ప్రతినిధులు
- సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానం
- ఆహ్వాన పత్రిక అందజేసిన ఛైర్మన్ బీఆర్ నాయుడు



**అమరావతి, సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేసింది. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ప్రాధాన్యం, ఉత్సవాల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్ల గురించి టీటీడీ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. శ్రీవారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా జరిగే వివిధ ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మీ, జానకిదేవితో పాటు టీటీడీ కార్యనిర్వహణాధికారి ముద్దాడ రవిచంద్ర కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న చర్యలపై కూడా చర్చించినట్లు తెలిసింది. ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించే సాలకట్ల బ్రహ్మోత్సవాలకు దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరవుతుంటారు. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల సమర్పణ కార్యక్రమం కూడా బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టంగా నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయం కొనసాగుతోంది. టీటీడీ ప్రతినిధుల ఆహ్వానాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బ్రహ్మోత్సవాల విజయవంతమైన నిర్వహణకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చినట్లు సమాచారం.

## అగనంపూడిలో నూతన ప్రయోగశాల ప్రారంభం



**విశాఖపట్నం, సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్:** గాజువాక శాసనస భ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు శనివారం అగనంపూడి ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన సమీకృత ప్రజారోగ్య ప్రయోగశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నూతన ప్రయోగశాల అందుబా టులోకి రావడం ద్వారా రోగ నిర్ధారణ సేవలు మరింత మెరుగు పడతా యని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆధునిక వైద్య పరికరాలతో ఏర్పాటైన ఈ కేంద్రం ద్వారా ప్రజలకు వేగవంత మైన, ఖచ్చితమైన వైద్య పరీక్షలు అందనున్నాయని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలను విస్తరించడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. ప్రజలు ప్రైవేటు కేంద్రాలపై ఆధారపడకుండా ప్రభుత్వ ఆసు పత్రులలోనే మెరుగైన సేవలు పొందేలా చర్యలు తీసుకుంటు న్నామని పేర్కొన్నారు. ఆరోగ్య రంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీ ట వేస్తోందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సమాన స్థాయిలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కొత్త సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రయోగశాల ద్వారా రోగాల నిర్ధారణ ప్రక్రియ మరింత సులభ తరం అవుతుందని, వైద్యుల సేవలకు ఇది తోడ్పడుతుందని ఆయన చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఇటువంటి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రజలకు అధునా తన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

## పోగొట్టుకున్న బ్యాగ్, సెల్‌ఫోన్ అప్పగింత

**తిరుమల, సెప్టెంబర్ 12 రాజధాని వాయిస్::** తిరుమలలో పోగొట్టుకున్న చేతి బ్యాగ్, సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి బాధితురాలికి అప్పగించారు. హనుమకొండ జిల్లా కాకిరాలపల్లి గ్రామానికి చెందిన కె. నవ్య తిరుమల దర్శనానికి వచ్చిన సమయంలో తన చేతి బ్యాగ్, సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. దీంతో ఆమె తిరుమల రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తమై పోగొట్టుకున్న వస్తువుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఉపయోగించి బ్యాగ్, సెల్‌ఫోన్‌ను గుర్తించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు. తక్కువ సమయంలోనే వాటిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు గుర్తించిన చేతి బ్యాగ్, సెల్‌ఫోన్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చి ధృవీకరణ అనంతరం బాధితురాలు కె. నవ్యకు అప్పగించారు. తనకు చెందిన వస్తువులు తిరిగి లభించడంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు. వేగంగా స్పందించి సహాయం చేసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. తిరుమలకు వచ్చే భక్తులు తమ విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఏవైనా వస్తువులు పోగొట్టుకున్నా లేదా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com